మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల్ / నారాయణపేట



# ప్రజావాణికి 37 ఫిర్యాదులు

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్ ప్రతీక్ జైన్

**నారాయణ పేట, మార్చి 23 ప్రభాతవార్త :** జిల్లాలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్య తనిస్తూ అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను వివరించి వినతిపత్రాలు సమర్పించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ వేగంగా పరిష్కారం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపకూడదని అధికారులను హెచ్చరించారు. ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 37 ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్‌లు

# అనుమతించరాదు

### మహబూబ్‌నగర్ కలెక్టర్ కుష్బూ గుప్త

### ప్రభుత్వ మోడల్ బేసిక్ హై స్కూల్‌లో ఎస్ఎస్‌సి పరీక్షా కేంద్రం తనిఖీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 23 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మోడల్ బేసిక్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌సి పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షల నిర్వహణ ను పరిశీలించారు. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్‌లు అనుమతించ రాదని చీఫ్ సూపరింటెండెంట్‌కు సూచించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను,విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా చర్యలు వంటి అంశాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రహరీ గోడ కూలి ఉండడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్, విద్యశాఖ అధికారులను వెంటనే గోడపునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే ఎస్ఎస్‌సి పరీక్షలను ఎటువంటి సమస్యలు లేకుండా, సజావుగా నిర్వహించాలన,ఎటువంటి సమస్యలకు తావు ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.



నూతన కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో రోడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

## కలెక్టరేట్ భవన ఆవరణలో

# రోడ్ల నిర్మాణం చేపట్టాలి

### నారాయణపేట కలెక్టర్ ప్రతీక్ జైన్

**నారాయణపేట, మార్చి 23ప్రభాతవార్త :** నూతన కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో రోడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సింగారం మలుపు దారి వద్ద నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టరేట్ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భవనం ఆవరణలో అంతర్గత రహదారులను తక్షణమే అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రధాన రహదారి నుంచి కలెక్టరేట్ భవన సముదాయం వరకు సమాంతరంగా రోడ్డు వేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే భవన సముదాయానికి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను భద్రతా కారణాల దృష్ట్యా అక్కడి నుంచి తొలగించి సమీపంలోనే మరొక అనుకూల ప్రదేశంలో ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ భవనం చుట్టూ నాలుగు వైపులా మొక్కలు నాటుతూ గ్రీనరీ అభివృద్ధి చేయాలని డీఆర్డీవో మొగులప్పకు సూచించారు. కలెక్టరేట్ సముదాయం పరిసరాల్లో రోడ్లు, ఇతర మౌలిక వసతుల పనుల్లో వేగం పెంచాలని ఆర్అండ్‌బీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్అండ్‌బిబీ డీఈఈ రాములు, పంచాయతీ రాజ్ ఈఈ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సభా మర్యాదలు కాపాడుతా..

### ప్రజా సమస్యలు బలంగా ప్రతిపాదిస్తా..

### స్పీకర్ మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తా..

### స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసిన విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ని అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ విప్‌గా ఎంపికైన అనంతరం తొలిసారిగా స్పీకర్ ను కలిసిన ఆయన, శాలువాతో ఘనంగా సన్మానించారు. తనపై పార్టీ నాయకత్వం, ప్రభుత్వం ఉంచిన విశ్వాసానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం దృష్ట్యా అసెంబ్లీ కార్యకలాపాలు సజావుగా జరిగేలా కృషి చేస్తానని, సభా నిర్వహణలో స్పీకర్ మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తూ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా, ప్రజా సమస్యలను సభలో బలంగా ప్రతిపాదిస్తూ ప్రజల గొంతుకగా నిలబడటానికి కట్టుబడి ఉన్నానని, ప్రజాసేవను మరింత నిబద్ధతతో ముందుకు తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ విప్‌గా నియామకం పొందిన ఎమ్మెల్యేకి , స్పీకర్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను సన్మానిస్తున్న విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

## అబద్ధపు మాటలు..

# మోసపు హామీల..

- రెండున్నర ఏండ్ల
- కాంగ్రెస్ పాలన అంతా తుస్సు
- బడ్జెట్లో అన్ని వర్గాలకు మొండి చేయి
- ఇంకెన్ని రోజులు
- ప్రజలను మభ్యపెడతారు
- ఒక ప్రాజెక్టు లేదు ఒక పథకము లేదు
- మూడు లక్షల కోట్ల అప్పు చేసి
- ఏం చేశారో చెప్పాలి
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డా.సి. లక్ష్మారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి డా.సి. లక్ష్మారెడ్డి

**జడ్చర్ల,మార్చి 23 ప్రభాతవార్త :** అబద్ధపు మాటలు... మోసపు హామీలు ఇదే రెండున్నర ఏండ్ల కాంగ్రెస్‌పాలన..అని ఇంకెన్ని రోజులు ప్రజల్ని మభ్య పెడతారని మాజీమంత్రి,బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కళా భవన్‌లో మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ అత్యంత అవినీతిమయమైందని, మంత్రులు మధ్య వాటా పంచాయతీ ఎప్పుడూ చూడలేదని, ఇటువంటి వారికి ప్రజల సంక్షేమం,అభివృద్ధి పై పట్టింపు ఉండదన్నారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు..కానీ చేతల్లో మాత్రం అవేవి కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడున్నర లక్షల కోట్లు అప్పు చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చెప్పారని అప్పుచేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పథకం ప్రారంభించిందో ఏ ప్రాజెక్టు నిర్మించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క పథకం కూడా, ఒక హామీ కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో రెండు లక్షల ఎనభై వేల కోట్లు అప్పు చేసిందని కేంద్రం పార్లమెంటులో చెప్పిందని మూడేండ్లు పూర్తి కాకముందే మూడున్నర లక్షల కోట్లు అప్పు చేసి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు కడుతున్నాం అంటున్నారు..ఆ లెక్కన అప్పు అంతా తీర్చేయాలి కదా అన్నారు. కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారం, దొంగ హామీలపై ప్రజల్లో చర్చ జరగాలని, హామీలు ఎప్పుడు నెరవేర్చుతారని ప్రజలు అడుగుతున్నారన్నారు. మూడున్నర లక్షల కోట్ల అప్పుతో ఏం పనులు చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రాజెక్టులు లేదు.. సంక్షేమం లేదు.. హామీల అమలు లేదు... మూడున్నర లక్షల కోట్లు ఏం చేశారని ప్రజలు అడుగుతున్నారని వారికి చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అంటేనే స్కాంలు అని మరోసారి నిరూపించారని, రైతు భరోసా నిధులు మూడు సార్లు ఎగ్గొట్టారని, బోనస్ ఎప్పుడూ ఇస్తారో తెలియదన్నారు. డిక్లరేషన్, గ్యారెంటీ లు మాయ,మోసం,దగా అని తేలిపోయిందని స్పష్టం చేశారు.కాంగ్రెస్‌పాలన ఫ్రీ బస్ తప్ప అంతా తుస్సు అన్నారు.ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చిరెండున్నర సంవత్సరాలు అయింది.హామీల అమలు ప్రస్తావన లేదన్నారు. బడ్జెట్ లో అంకెల గారడీ తో అభివృద్ధి సాధ్యం కాదని, పేపర్ లో మాత్రమే అంకెలను అటు ఇటు మార్చి చెప్పినంత మాత్రాన క్షేత్రస్థాయిలో ఫలితాలు రావు...సంక్షేమం అందదన్నారు. సమావేశంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, నాయకులు పాలాది రామ్మోహన్, కోట్ల ప్రశాంత్ రెడ్డి, శంకర్ నాయక్, శ్రీనివాస్ యాదవ్, పెద్ది వెంకటేష్, రెహమాన్, రాజేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పునుంతల ఎంపిడిఓ కార్యాలయంలో సిబ్బంది హాజరు కాకపోవడంతో వెల వెల బోతున్న సాధారణ విభాగం సెక్షన్

## కార్యాలయాల్లో అధికారుల

# రూటే సపరేటు

### సమయపాలన పాటించని సెక్షన్ అధికారులు

### నాయకుల అలసత్వంతో అధ్వానంగా

### మారిన మండల స్థాయి అధికారులు

### మండల ప్రజలకు శిక్షగా మారిన అధికారులు

**ఉప్పునుంతల, మార్చి 23 ప్రభాతవార్త :** మండలంలో నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాల్లో కింది స్థాయి అధికారుల పనితీరుతో తలలు పట్టుకున్నారు. మండలంలో పనిచేస్తున్న వివిధ ప్రభుత్వ కార్యాలయంలో కిందిస్థాయి అధికారులు వారు ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్న ఎవరు పట్టించుకోకుండా మండల స్థాయి నాయకుల అలసత్వంతో ఇలా మారిందని బహిరంగంగా అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఒక్కొక్క కార్యాలయ సిబ్బంది విధుల పట్ల మండల ప్రజలకు పెట్టిన శిక్షగా మారింది. ప్రజా ప్రభుత్వ పాలనలో తమ సమస్యలను విన్నవించుకునేందుకు వెళ్లిన మండల స్థాయి అధికారుల వద్దకు వెళ్లగా సంబంధిత సెక్షన్ అధికారులకు సమయం కాలేదనివారు ఎప్పుడు వస్తారో తెలియదని స్వయాన మండలస్థాయి అధికారి వచ్చిన ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.మండల ప్రజాపరిషత్ కార్యాలయం సిబ్బంది రూటే సపరేటు,వారిని ఎవరు ఎదిరించలేరు,ప్రశ్నించలేరని – మిగతా4లో..

## డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్‌గా

# వినియోగిస్తే చర్యలు..

### గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎటువంటి ఆందోళన అవసరం లేదు

### ప్రజలకు సరిపడా గ్యాస్ సిలిండర్ల నిల్వలు ఉన్నాయి

### గ్యాస్ గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

### ప్రజలు తొందరపడి గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకోవద్దు

**వనపర్తి, మార్చి 23 ప్రభాతవార్త :** జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలకు సరిపడా నిల్వలు ఉన్నాయని, ప్రజల డిమాండ్ మేరకు సకాలంలో సిలిండర్లు సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ, రాజానగరం శివారులో ఉన్న వారి గోదామును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీలో ఉన్న రికార్డులను కలెక్టర్ – మిగతా4లో..



గ్యాస్ సిలిండర్ల గోదాములను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

# ఫుడ్ సేఫ్టీపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి

### జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్‌లలో ఆహార నియమాలను సేకరించి నివేదిక ఇవ్వాలి

### గృహావసరాల ఎల్‌పిజి సిలిండర్లకు జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేవు

### ప్రజలు అనవసరంగా భయాందోళనలకు గురికావద్దు : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి,మార్చి 23 ప్రభాతవార్త :** జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్‌లతో పాటు అన్ని విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లలో ఆహార నాణ్యత పై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని, తరచుగా ఆహార నమూనాలను సేకరించి నాణ్యత ప్రమాణాలు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కరుణాకర్‌ను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి హాల్లో జిల్లాలో ఆహార పదార్థాల నాణ్యత, సిలిండర్ల సరఫరాపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రానున్న వర్షాకాలం సీజన్లో విద్యార్థులు, ప్రజలు రోగాల బారిన పడకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు, పాఠశాలల్లో ఆహారనిల్వలు,వండిన ఆహారపదార్థాలు నమూనాలను ఎప్పటికప్పుడు సేకరించి ల్యాబ్ కు పంపించి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ఫుడ్ సేఫ్టీ అధికారిని ఆదేశించారు. జిల్లాలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్‌లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార పదార్థాల నమూనాలు తరచుగా సేకరించి నాణ్యత ప్రమాణాలు పరిశీలించాలని సూచించారు. ఆహార పదార్థాలు సిద్ధం చేసే అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లు, హోటళ్లు, రెస్టారెంట్‌లు ఎఫ్ఎస్ఎస్ఎఐలో ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. దీనికొరకు ఫోస్కస్ వెబ్సైట్ కి లాగిన్ అయి ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అన్నారు. సిలిండర్ గ్యాస్ ల పై సమీక్ష నిర్వహిస్తూ పశ్చిమాసియాలో జరుగుచున్న యుద్ధాల వల్ల క్రూడ్ ఆయిల్, గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు ఉన్నప్పటికి ప్రభుత్వ ముందస్తు చొరవ వల్ల గృహావసరాలకు వాడే సిలిండర్ గ్యాస్ సరఫరాలో ఎలాంటి సమస్య లేదని, కేవలం వాణిజ్య సిలిండర్ల సరఫరాలో కొంత కోత ఉన్నట్లు తెలిపారు. గృహావసరాలకు ఒకసారి సిలిండర్ తీసుకున్నాక పట్టణ ప్రాంతంలో అయితే 25 రోజులు, గ్రామీణ ప్రాంతంలో అయితే 45 రోజుల తర్వాత తిరిగి బుక్ చేసుకోవచ్చని, ప్రజలు అనవసర ఆందోళనతో ఒక్కసారిగా అవసరం లేకున్న బుక్ చేసుకుంటూ ఇబ్బందులు పడవద్దని తెలియజేశారు.అన్ని విద్యాలయాలు, హాస్టళ్లు, కేజీబీవీలు, ఆసుపత్రులకు గ్యాస్ సిలిండర్ సమస్యలు లేకుండా సరఫరా చేయడం జరుగుతుందని తెలియజేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్.ఖీమ్య నాయక్, జడ్పీ సిఈఓ యాదయ్య, జిల్లా సివిల్ సప్లై అధికారి కాశి విశ్వనాథ్, ఆర్డీఓ సుబ్రమణ్యం, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కరుణాకర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రుణాల వసూలులో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

**గద్వాల మార్చి 23, ప్రభాతవార్త :** స్త్రీనిధి రుణాల వసూలులో జిల్లా చాలా వెనుకబడిందని, రికవరీ చేయడంలో అలసత్వం వహించే సిబ్బంది పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ అన్నారు.సోమవారం సాయంత్రం ఐడిఓసి సమావేశపు మందిరంలో స్త్రీ నిధి రుణాల వసూలుకు సంబంధించి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జోగులాంబ గద్వాల జిల్లాలో 2119 స్వయం సహాయక సంఘాలకు చెందిన 8283 మంది సభ్యులకు స్త్రీనిధి కింద రుణాలు ఇస్తే రూ.10.88 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. 8 మండలాల్లో కోటి రూపాయల చొప్పున బకాయిలు ఉన్నాయని 45 రోజుల్లోగా ఇక్కడి సిబ్బంది రూ.20 లక్షలు, మిగిలిన మండలాల వారు రూ.10 లక్షల చొప్పున పెండింగ్ బకాయిలను వసూలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వం ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోకుండా సొంత ప్రయోజనాలకు వినియోగిస్తే ఉపయోగం లేదన్నారు. ప్రతి సభ్యురాలు తీసుకున్న రుణాలతో వ్యాపారాలు, వృత్తులు చేసుకొని ఆర్థికంగా ఎదిగితేనే రుణాలను తిరిగి చెల్లించగలుగుతారన్నారు. సంబంధిత మండలాల ఏపీఎంలు, సీసీలు,వివోలు రికవరీ యాక్షన్ ప్లాన్ తయారు చేసి స్త్రీ నిధి రుణాల బకాయిలపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలన్నారు. బకాయి పడ్డ వారికి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయాలని నిర్దేశిత సమయంలోగా చెల్లించకుంటే మరోసారి నోటీసులు అందజేసి అప్పటికి స్పంధించకుంటే అవసరమైతే చట్ట ప్రకారం కేసులు పెట్టవచ్చన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేస్తుంటే కొంతమంది తిరిగి చెల్లించకుండా తమ పలుకుబడిని ఉపయోగించడం సరికాదన్నారు. పిఎండిడికేవైలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పిఎం ఎఫ్ఎంఈ (ప్రధానమంత్రి ఫామ్లైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్) కింద జిల్లాకు ఐదువేల యూనిట్ల వరకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇందులో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.40 వేల చొప్పున ప్రత్యేక రుణాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో నిర్దేశిత సమయంలో కనీసం 400 యూనిట్లను గ్రౌండింగ్ చేయగలిగితే మిగతా యూనిట్లు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. సంబంధిత అధికారుల అలసత్వం కారణంగా జిల్లాకు మంజూరైన నిధులు వెనక్కి వెళితే సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. పలు రంగాల్లో వెనుకబడిన జోగులాంబ గద్వాల జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అధికార యంత్రాంగం కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, స్త్రీనిధి జనరల్ మేనేజర్ రవికుమార్, రీజనల్ మేనేజర్ సందీప్, డిఆర్డిఏ ఏపిడి శ్రీనివాస్, ఎల్‌డిఎం శ్రీనివాసరావు, డిపిఎంలు, ఆయా మండలాల ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## కోట్ల విలువైన భూమి

# స్వాహాకు ప్రయత్నాలు.!

### అధికారం, అధికారులు మీ చేతుల్లోనే ఉన్నారు..

### బిఆర్ఎస్ నాయకులైతే చర్యలు తీసుకోండి

**బిజినేపల్లి, మార్చి 23 ప్రభాతవార్త:** జుట్టయ్య కుంటను చదును చేసి కోట్లవిలువైన భూమి స్వాహాకు ప్రయత్నాలు చేసిన వ్యక్తులను గుర్తించి ప్రభుత్వం వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు నెల్లికంటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామశివారులోని జుట్టయ్య కుంటలో 17.10 ఎకరాల విస్తీర్ణంలో భూమి ఉందని,ఇది శిఖం భూమి అని అధికారులే – మిగతా4లో..



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వర్ రెడ్డి

## భగత్‌సింగ్ ఆశయ సాధనతో పని చేయాలి

**ఆత్మకూర్ మార్చి 23, ప్రభాతవార్త:** దేశ స్వాతంత్రం కోసం అతిపెద్ద వయసులోనే ఉరికంబమెక్కి యువతకు ఆదర్శంగా నిలిచినటువంటి భగత్ సింగ్ ఆశయ సాధన కోసం ప్రస్తుత సమాజంలో యువతీ యువకులు భగత్ సింగ్ కొనసాగించేందుకు ముందుకు రావాలని పియుసిఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుతూపు తదితరులు పిలుపునిచ్చారు, భగత్ సింగ్ 95వ వర్ధంతి పురస్కరించుకొని మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలోని గాంధీ చౌరస్తా మరియు మార్కెట్ యార్డ్ ఆవరణలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్వతంత్ర భారతావని కోసం అతిపెద్ద వయసులో అసువులు బాసిన భగత్ సింగ్ ఆశయాలు కొనసాగించాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతీ యువకులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులతో పాటుగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



భగత్ సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

## ఉచిత మెగా వైద్య చికిత్స శిబిరం

**కోయిలకొండ మార్చి 23, ప్రభాతవార్త :** కోయిలకొండ మండలం ఉబ్బడి తండా గ్రామపంచాయతీలో ఈనెల 25న ఉచిత వైద్య చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ హరి సింగ్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ వి ఎస్ హాస్పిటల్ వారి వైద్య బృందం సౌజన్యంతో ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ భరత్ నందన్ రెడ్డి సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు. గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అన్ని రకాల రోగాలకు వైద్య చికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి హాజరుకానున్నారని సర్పంచ్ హరి సింగ్ నాయక్ తెలిపారు. వైద్య చికిత్సల నిమిత్తం వైద్య శిబిరానికి వచ్చే వారు తమ వెంట తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకురావాలన్నారు. ఇట్టి కార్యక్రమానికి మండల తహసిల్దార్ రాజా గణేష్, మండల అభివృద్ధి అధికారి ధనుంజయ గౌడ్ లు హాజరు కావడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరాన్ని విజయవంతం చేసేందుకు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

## మిత్రుడి కుటుంబానికి ఆపన్నహస్తం

**చనిపోయిన మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మిత్రులు**

**భూత్పూర్,మార్చి 23,ప్రభాతవార్త :** గత నెల విధి వక్రించి అకాల మృత్యువు పాలైన 1997-98 టెన్త్ బ్యాచ్‌కు చెందిన అమిస్తాపూర్ రాజు గత నెల మృతి చెందగా,ఆ బ్యాచికి చెందిన మిత్రులందరూ కలిసి ఏకమై మృతుని కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు.భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌కు చెందిన రాజు గత నెల 19న ఆకస్మికంగా మృతి చెందాడు.ఇదే బ్యాచికి చెందిన అందుబాటులో ఉన్న మిత్రులు ఆపన్నహస్తమందించి తమకు తోచిన ఇతోధిక సహాయం అందించారు.వీరందరూ కలిసి రు.33వేల500ల నగదును ప్రోగు చేసి తన మిత్రుడు రాజు కుటుంబ సభ్యులకు అందించారు.సహాయం అందించినవారిలో కెంద్యాల రాజేష్‌కుమార్,కెంద్యాల మశ్చందర్,ఆర్యన్ మధు,గొడుగు మల్లేష్,నెల్లి యాదగిరి,రాజగౌడ్,చీపుర్ల తిరుపతి,చంద్రశేఖర్,ఎర్రన్న,రంగన్న,ఆశన్న తదితరులు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందిస్తున్న స్నేహితులు

## భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిస్తాం

**బిజినపల్లి, మార్చి 23 ప్రభాతవార్త :** స్వాతంత్ర సమరయోధుడు విప్లవ పోరాటాలకు స్ఫూర్తి షహీద్ భగత్ సింగ్ అని, వారి ఆశయాల సాధనకు కృషి చేస్తామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని పూలె అంబేద్కర్ చౌరస్తాలో భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. గుంపల్లి అశోక్ మాట్లాడుతూ దేశ స్వతంత్రం కొరకు 31సంవత్సరాల వయస్సులోనే ఉరికంబాన్ని ఎక్కిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఒక కులం ఇంకొక కులాన్ని, ఒక మతం ఇంకొక మతం, ఒక వర్గం ఇంకొక వర్గాన్ని దోచుకొని సమాజం కోరుకున్న వ్యక్తి అని అన్నారు. నేటి పరిస్థితుల్లో సామ్రాజ్యవాదం పెట్రేగి పోతుంది అని భగత్ సింగ్ స్ఫూర్తి తో దానిపై పోరాటం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, శ్రీశైలం, మల్లేష్, రాజు, రమేష్, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



బిజినేపల్లిలో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు

## యశోదా కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో క్రికెట్ లీగ్

**నారాయణపేట, మార్చి 23 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా అప్పిరెడ్డిపల్లి గ్రామంలో యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు యశోదా కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించబడింది. గ్రామ యువత ఉత్సాహంగా పాల్గొని పోటీలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ఈ టోర్నమెంట్‌లో వివేకానంద మిత్రమండలి జట్టు విజేతగా నిలిచింది శివ ఫ్రెండ్స్ టీమ్ రన్నరప్‌గా నిలిచి మంచి ప్రదర్శన కనబరిచింది. ఫైనల్ మ్యాచ్ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యశోదా కేర్ హాస్పిటల్స్‌కు చెందిన డా. రవీందర్ లక్షావత్ ఎమ్‌డీ రేడియో డయాగ్నోసిస్ హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ వెంకట్ రెడ్డి తో కలిసి గెలిచిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఇలాంటి క్రీడా కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత, క్రీడాకారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు స్థానికులు అభినందనలు తెలిపారు.

## సమస్యలను గుర్తించి పరి ష్కారించేందుకు కృషి

**వెల్టూర్‌లో జరిగిన గ్రామసభలో వెల్లడించిన సర్పంచు చింతోజు వెంకటేష్**


**ఉప్పునుంతల, మార్చి 23 ప్రభాతవార్త :** గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారించేందుకు కృషి చేస్తానని సర్పంచ్ చింతోజు వెంకటేష్ అన్నారు.సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో పలు సమస్యలపై చర్చించారు. ఎస్సీ కాలనీలో మంచి నీటి సరఫరా కావటం లేదని మీషన్ భగీరథ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కాలనీ కోరారు. సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పాటు తోనే గ్రామస్తులు సభలో చర్చించారు. సంబంధిత విద్యుత్ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని గ్రామసభలో సర్పంచ్ చింతోజు వెంకటేష్ హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో పారిశుద్ధం, తాగునీరు, విద్యుత్ సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా చేయాలని, గ్రామంలో ఎటువంటి సమస్యలున్న గ్రామసభలో విన్న వించుకోవడానికి ఇది ఎంతో దోహదపడుతుందని గ్రామ సర్పంచ్ ప్రజలకు వివరించారు. ఈ గ్రామ సభలో గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్,ఉప సర్పంచ్ ఉప్పరి మల్లయ్య, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఉమ శంకర్,జిపిఓ రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ చింతోజు వెంకటేష్

## ఉప్పునుంతల ఉప తహసీల్దార్‌గా రమేష్ నాయక్

**ఉప్పునుంతల, మార్చి 23 ప్రభాతవార్త :** ఉప్పునుంతల తహసీల్దార్ కార్యాలయంలో ఇంఛార్జి ఉప తహసీల్దార్ గా వి.రమేష్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉప తహసీల్దార్ గా పనిచేసిన పరుశు నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ,ఉప తహసీల్దార్ స్థానాన్ని భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రత్యేక చొరవ తీసుకొని పెద్దకొత్తపల్లి లో ఉప తహసీల్దార్ గా పనిచేస్తున్న రమేష్ నాయక్ కు అదనపు బాధ్యతలు అప్పగించడంతో సోమవారం ఉప్పునుంతల ఇంఛార్జి ఉప తహసీల్దార్‌గా వి.రమేష్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. మండలంలో 2017,18 సంవత్సరం లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా పనిచేసిన అనుభవం ఉండడంతో దీంతో ఉప తహసీల్దార్‌కు మండలంపై కొంత అవగాహన ఉంది. అందరి సహకారంతో రెవెన్యూ శాఖ విధుల పట్ల ఎలాంటి ఆటంకం కలగకుండా బాధ్యతలు పూర్తి చేస్తానని ఆయన అన్నారు.



ఉప తహసీల్దార్‌గా రమేష్ నాయక్

# బిజేపీ నాయకులు ముందస్తు అరెస్టు



పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన బిజేపీ నాయకులు



వనపర్తిలో బిజెపి నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

**కెటిదొడ్డి మార్చి23,ప్రభాతవార్త:**తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారావు పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల హామీలు అమలు చేయలేదని అసెంబ్లీని ముట్టడించాలని సోమవారం బిజేపీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా బిజెపి నాయకులను కెటిదొడ్డి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.... మహిళలకు 2500,, షాదీ ముభారక్,కళ్యాణ్ లక్షి ్మలక్ష రూ పాయలు తులం బంగా రం,,వృద్ధులకు పింఛన్లు 4000 ,వికలాంగులకు 6000, ఉచిత గ్యాస్‌కు 500, ఎలక్షన్ సమయంలో ప్రజలకు హామీలు చెప్పి మాట తప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల శ్రీపాద రెడ్డి,ఓబిసి మండల అధ్యక్షుడు ముంగిలి వీరేష్, సీనియర్ నాయకులు హన్మిరెడ్డి,ఎర్ర భీమ్ రెడ్డి, దేవేందర్, కార్యకర్తలు డి. వీరేష్, కొండన్న, తదితరులు ఉన్నారు.

**అసెంబ్లీ భవనం దగ్గర వనపర్తి జిల్లా బిజెపి నాయకులు అరెస్ట్**

**సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటే పల్లి పురుషోత్తం రెడ్డి**

**వనపర్తి, మార్చి 23 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్ర రావు పిలుపుమేరకు ఆర్ గ్యారంటీలు 420 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పక్కా వ్యూహంతో అసెంబ్లీ సమీపానికి చేరుకున్న వనపర్తి జిల్లా నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్లో నిర్బందించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటే పల్లి పురుషోత్తం రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి ఆరు గ్యారెంటీలు,420 మోస పూరిత హామీలతో గద్దెనెక్కి 27 నెలలైనా ఒక్క హామీ కూడా అమలు చేయకుండా మహిళలు, నిరుద్యోగులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగస్తులు, రిటైర్డ్ ఉద్యోగస్తులు అందరిని మోసం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వెంటనే గ్యారెంటీలు హామీలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర నాలుగు కోట్ల ప్రజల తరఫున బిజెపి పార్టీ పెద్ద ఎత్తున అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని బిజెపి పిలుపుకు చెమటలు పట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం లాగానే పోలీసులను ఉపయోగించి బలవంతంగా బిజెపి నాయకులను కార్యకర్తలను అరెస్టుల పేరిట నిర్బంధించారని ప్రజా ఉద్యమాలను ప్రతిపక్షాలను అణిచివేయాలని చూస్తే రెట్టింపు ఉత్సాహంతో ఆందోళనలు నిర్వహిస్తామని హామీలను అమలు చేసే వరకు రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యేలను మంత్రులను ప్రజల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. అసెంబ్లీ ముట్టడిలో పాల్గొన్న వారిలో సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటే పల్లి పురుషోత్తం రెడ్డి, జోగులాంబ గద్వాల జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్.రామచంద్ర రెడ్డి, వనపర్తి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జోగులాంబ గద్వాల జిల్లా ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షులు నలబోతుల అరవింద్, ఐటీసీ జిల్లా కన్వీనర్ అంజి యాదవ్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు ఆగపోగు చాణుక్య, పట్టణ నాయకులు చంద్రశేఖర్, వరుణ్ కుమార్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

**బిజెపి నాయకుల అరెస్ట్**

**నవాబ్ పేట, మార్చి 23 ప్రభాతవార్త :** అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన నవాబ్ పేట్ బిజెపి నాయకులను నవాబుపేట పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును హరించడం దుర్మార్గమని బిజెపి మండల నాయకులు అన్నారు. ఈ విధంగా ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడం ద్వారా ప్రభుత్వం తన వైఫల్యాలను దాచాలని ప్రయత్నిస్తున్నదని వారు విమర్శించారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే బిజెపి మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ లోకిరేవు శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పసుపుల యాదయ్య, మండల ప్రధాన కార్యదర్శి గణేష్ చారి, మండల కోశాధికారి రవి, సోషల్ మీడియా కన్వీనర్ నరేష్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి మండే మల్లేష్, సీనియర్ నాయకులు పురుషోత్తం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



నవాబ్‌పేటలో అరెస్టయిన బిజెపి నాయకులు

**బిజెపి నేతల అరెస్టు**

**కోయిలకొండ మార్చి23, ప్రభాతవార్త :**భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో హైదరాబాద్ వెళ్ల కుండా మండల బిజెపి మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిని, మండల బిజెపి ప్రధాన కార్యదర్శి నక్క రమేష్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు.ఈసందర్భంగా మండల బిజెపిమాజీ అధ్యక్షుడువెంకట్ రామ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న బిజెపిపార్టీని కాం గ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం చాలా దారుణం అన్నారు. తెలం గాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను గాలికి వదిలేసారని ఆయన ఈ సందర్భం గా అన్నారు. ఎంత మందిని అరెస్టు చేసిన పోరాటం ఆగేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



అరెస్ట్ అయిన బిజెపి నేతలు

## అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు వేతనం పెంచాలి

**నారాయణ పేట, మార్చి 23 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్స్ తమ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ పార్క్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లానాయకులు వెంకట్రామిరెడ్డి,బండమీది బలరాం,అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శశికళ, కార్యదర్శి శివకుమారి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీ టీచర్లు హెల్పర్లకు కనీసం రూ.18,000వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఐసిడిఎస్‌కు సరిపడా నిధులు కేటాయించి ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎన్ఈపీ 2020 విధానాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని, 2026 విద్యా విధానాన్ని సవరించాలని తెలిపారు. ప్రీప్రైమరీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని సూచించారు అంగన్‌వాడీ సిబ్బందికి మే నెలలో పూర్తిస్థాయి సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,000గా నిర్ణయించడంతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని,జీఓ నెంబర్లు 14,80లను సవరించాలని తెలిపారు రిటైర్డ్ సిబ్బందికి తగిన ఆర్థిక సాయం వెంటనే అందించాలని అన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయడం, సమ్మె వేతనాలు, ఎరియర్స్ చెల్లించడం, సీనియారిటీ ప్రకారం ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అంతే కాకుండా ఆరోగ్య లక్షి ్మ మెనూ చార్జీలు పెంచడం, బిఎల్ఓ డ్యూటీలను రద్దు చేయడం వంటి పలు డిమాండ్లు ఉంచారు. సమస్యలు పరిష్కరించకపోతే మరింత తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అంగన్‌వాడీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




జిల్లా కలెక్టరేట్ ముట్టడిలో అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు

## ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ శిబిరం

**చిన్నచింతకుంట,మార్చి 23 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని రైతు వేదికలో వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమాలు ఐదు రోజుల పాటు కొనసాగింది. సోమవారంతో వార్డు సభ్యుల శిక్షణ శిబిరం ముగిసింది. ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు, వివిధ శాఖల అధికారులు వార్డు సభ్యులకు గ్రామ సమస్యలు, సంక్షేమ పథకాలు,కేంద్ర ప్రభుత్వ పథకాలు, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీలోని వార్డు సభ్యులు తమ తమ వార్డులలో నెలకొన్న సమస్యలను పాలకవర్గంలో చర్చించి పరిష్కారం చూపెట్టాలని,ప్రతి మూడు నెలలకోమారు జరిగే గ్రామసభల్లో ఆయా వార్డులో నెలకొన్న సమస్యలను తీసుకురావడం వార్డు సభ్యుల పాత్ర కీలకం. గ్రామ స్థాయిలో ఉండే సమస్యలు చెత్త కుప్పలు, మురుగు కాలువల శుభ్రం, వీధిలైట్లు, మంచినీటి సరఫరా, గ్రామ పరిపాలన వ్యవస్థ, పంచాయతీ రాజ్ చట్టం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామపంచాయతీ అభివృద్ధిలో ముందడుగు వేయాలంటే సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు, మల్టీపర్పస్ వర్కర్లు సమన్వయంతో పని చేస్తే గ్రామం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తుందని వార్డు సభ్యులకు అధికారులు దిశా నిర్దేశం చేశారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్న వార్డు సభ్యులకు సర్టిఫికెట్లను అధికారులు అందజేశారు. వార్డు సభ్యులు శిక్షణ ఇచ్చిన అధికారులకు వార్డు సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కృష్ణ ఓబుల్ రెడ్డి,ఎంపీఓ మోసిన్, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందజేసిన అధికారులు

## మక్తల్ మున్సిపల్ కమిషనర్‌ను సన్మానించిన కౌన్సిలర్‌లు

**మక్తల్ టౌన్, మార్చి 23 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపల్ కమిషనర్ శ్రీరాములుని సోమవారము ఉదయం మక్తల్ 16వ వార్డ్ కౌన్సిలర్ అల్కూరి పావని, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపిటిసి సభ్యులు వల్లంపల్లి లక్ష్మణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శలంబిన్ ఉమర్,నారాయణ,మక్తల్‌టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఏ. రవికుమార్,16వవార్డు నాయకులు అనంపల్లి రమేష్,వల్లంపల్లి గురురాజ్,మందిపాల్ సతీష్‌లు కమిషనర్‌ను శాలువాతో సన్మానించి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 16వ వార్డ్ లో పలు అభివృద్ధి పనుల గురించి కమిషనర్ వద్ద ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి భరోసా ఇచ్చారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రి డా. వాకిటి శ్రీహరి కృషితో సీసీ రోడ్లు డ్రైనేజీలు, తాగునీటి పైప్ లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈసందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరికి వార్డు ప్రజలు, స్థానిక నాయకుల తరపున ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి, స్థానిక వార్డు అభివృద్ధి చేసుకునేందుకు మంత్రి వాకిటి శ్రీహరి కృత నిశ్చయంతో ఉన్నారని, ప్రతి ఒక్కరి తరపున పేరు పేరునా మంత్రి వాకిటి శ్రీహరికి ధన్యవాదాలు చెబుతున్నామని అన్నారు.




కమిషనర్ శ్రీరాములును సన్మానిస్తున్న సర్పంచ్ పావని

## తాటిపర్తిలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్

**భూత్పూర్,మార్చి23,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం తాటిపర్తి గ్రామంలో సోమవారం మండల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి హబీబా ఫసియోద్దిన్ ప్రారంభించారు.ఈ శిబిరంలో గ్రామంలోని 13మంది రైతులకు చెందిన దాదాపు 251గేదెలు,పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు.ఈ వైద్య శిబిరంలో గ్రామ ఉపసర్పంచి మద్ద రాఘవేందర్,గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి, వార్డుసభ్యులు మిట్టనరేందర్,యాదయ్య,అన్వర్‌పాష,మాజీ ఎంపీటీసీ డిపుల్లయ్య,ఎండిసలాంలతో పాటు వెటర్నరీ అసిస్టెంట్ శోభ, గోపాలమిత్ర చెన్నయ్య పాల్గొన్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూధన్‌గౌడ్ తెలిపారు.ఈ నెల 10వ తేదీ నుంచి వచ్చే నెల 9వతేదీ వరకు నెల రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాలలో గేదెలలో సోకే గాలికుంటు వ్యాధి నివారణ కోసం పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మధుసూధన్‌గౌడ్ తెలిపారు.ఈ సదవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న అధికారులు,సిబ్బంది



పట్టపగలు వెలుగుతున్న వీధిలైట్లు

## ఈ భారం ఎవరు భరించాలి?

**పట్టపగలే వీధిలైట్ల వెలుగులు**

**నవాబుపేట, మార్చి 23 ప్రభాతవార్త :** మండలంలో చాలాగ్రామాల్లో వీధి దీపాలు పగలూ రాత్రి తేడా లేకుండా పట్టపగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి.గ్రామాల్లో ఎల్ఈడీ బల్బులను అమర్చారు. అయితే, పలుగ్రామాల్లో విద్యుత్ తీగలు పాడై ఉండడంతో ఈ బల్బులు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. మండల పరిధిలోని ఇప్పటూరు గ్రామ పంచాయతీ తదితర గ్రామాల్లో విద్యుత్ దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. దీనివల్ల విద్యుత్ వృథా అవడంతో పాటు బల్బులు కూడా తొందరగా పాడైపోయే వీలుంది. గ్రామాల్లో స్తంభాలకు నిరంతరంగా వెలిగే వీధిలైట్లు ఇలా నిరంతరం వెలుగుతూ ఉంటే, వాటి బిల్లు భారం ఎవరిపై పడుతుందని ప్రజలు వాపోతున్నారు. గ్రామ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి మూడు రోజులు జైలు శిక్ష

**వీపనగండ్ల మార్చి 23, ప్రభాతవార్త:** గత ఐదు రోజుల కిందట మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు వీపనగండ్ల ఎస్సై జె నరేష్ కుమార్ తెలిపారు సోమవారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత గురువారం నాడు వీపనగండ్ల ఎస్సై జె నరేష్ కుమార్ వారి సిబ్బంది గోవర్ధనగిరి గ్రామ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా చిన్నంబావి మండలం మియాపురం గ్రామానికి చెందిన జి రాముడు జమ్ములయ్య వయసు 42 సంవత్సరాలు వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతుండగా ఇతని వాహనాన్ని చెక్ చేయగా మద్యం తాగి నడుపుతున్నట్లు గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇతనిపై కేసు చట్టపరంగా నమోదు చేసి ఫస్ట్ జ్యుడీషియల్ కోర్టు వనపర్తి నందు హాజరు పరచడం జరిగిందని ఆయన తెలిపారు. అతనికి బి శ్రీలత జడ్జి మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగిందని ఆయన సోమవారం నాడు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో బైకులు ఇతరత్రా వాహనాలు నడిపే వ్యక్తులు తమ ప్రయాణ సందర్భంగా మత్తు మందులు సేవించి వాహనాలు నడుపుతే వారి పైన కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా వాహనదారులకు ఆయన హెచ్చరించారు. పోలీసు వాళ్ళు రహదారులలో వాహనాలను చెక్ చేస్తున్న సందర్భంగా దురుసుగా ప్రవర్తించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## అనుమానాస్పదంగా గుర్తుతెలియని మహిళ మృతి

**ఖిల్లాగణపురం మార్చి23,ప్రభాతవార్త:** గుర్తుతెలియని మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం మండల పరిధిలోని రోడ్డు మీద తండా హనుమన్ల మాన్యం కత్వ వద్ద సుమారు 45 సంవత్సరములు ఉన్న గుర్తు తెలియని మహిళను ఎవరో హత్య చేసి ఇక్కడ పడవేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఆకుంట సమీపంలో ఉన్న రైతులు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై వెంకటేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పదంగా మృతి చెందిన మహిళగా గుర్తించామని ఎవరికైనా అనుమానాలు ఉంటే పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని చెప్పారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించి విచారణ జరుపుతామని ఎస్సై తెలిపారు.



అనుమానాస్పదంగా మృతి చెందిన మహిళ

## ఆవంచలో వైభవంగా

## శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం

**ముఖ్య అతిధులుగా హాజరైన శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాద రామానుజ జీయర్ స్వామి**

**కళ్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి**

**నాగర్‌కర్నూల్, మార్చి 23 ప్రభాతవార్త :** తిమ్మాజి పేట మండలం ఆవంచ గ్రామంలో శ్రీ మహాలక్ష్మి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. కళ్యాణమహోత్సవంలో మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి, వారి కూతురు స్ఫూర్తి స్వామి,అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిధులుగా శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాద రామానుజ జీయర్ స్వామి హాజరయ్యారు. మాజీ మంత్రి కి రామానుజ జీయర్ స్వామి వేద ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రకళమోహన్ రెడ్డి,గ్రామ పెద్దలు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



స్వామివారి కళ్యాణంలో పాల్గొన్న మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి

## బీజేపీ నాయకుల అరెస్టు

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కొండయ్య**

**మక్తల్ టౌన్, మార్చి 23 ప్రభాతవార్త :** తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇచ్చిన పిలుపు మేరకు చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకముందే, పార్టీ ఆదేశాల ప్రకారం సిద్ధమవుతున్న నాయకులను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం పై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. కొండయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా బి. కొండయ్య మాట్లాడుతూ ప్రజల కోసం ఎన్నిసార్లైనా అరెస్టులకు సిద్ధమని అన్నారు.ప్రజల కోసం మాపై ఎన్ని కేసులు పెట్టినా వాటిని ఎదుర్కొనేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ప్రజలకు అండగా నిలవడమే బీజేపీ లక్ష్యం అని స్పష్టం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, ముఖ్యంగా ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ప్రజలకు సరైన పరిపాలన అందించడంలో విఫలమైన ఈ చేతగాని ప్రభుత్వం, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బీజేపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని అన్నారు. అర్ధరాత్రి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, పోలీస్ వ్యవస్థను కూడా దుర్వినియోగం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కొండయ్య, కర్ని స్వామి, బాల్చేడ్ మల్లికార్జున్, ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్ రాశేఖర్ రెడ్డి, కౌన్సిలర్ పీకే నరసింహ, కౌన్సిలర్ కృష్ణ, టైలర్ నరేందర్, బ్యాటరీ రాజు, లక్ష్మీపతి, అశోక్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## అగ్నివీర్ ఉచిత శిక్షణ ప్రారంభం

**నారాయణపేట, మార్చి 23 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలో మిల్కా సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో అగ్నివీర్ ఎంపికల కోసం ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సేవకు యువత ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. అకాడమీలో ఫ్యాకల్టీ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఉచితంగా శిక్షణ అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో శిక్షణ తీసుకుని ఆర్మీలో ఎంపిక కావాలని సూచించారు. డీఐఈఓ నర్సింగ్ రావు మాట్లాడుతూ యువత ఆర్మీలో చేరి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మాజీ సర్పంచ్ రఘువేందర్ రెడ్డి కూడా యువతకు సహాయం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఫ్యాకల్టీ సభ్యులు, అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ప్రభాకర్ ఇచ్చిన స్ఫూర్తిదాయక ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భగత్ సింగ్‌కు నివాళులర్పించి ఆయన త్యాగాలను స్మరించారు.

## అరెస్టులు అప్రజాస్వామికం

**మండల బిజెపి అధ్యక్షులు నల్లె నరప్ప**

కృష్ణ,మార్చి 23 ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలు నిలబెట్టుకోవడంలో విఫలమైందని, రైతులకు, యువతకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని తెలంగాణ సర్కారుపై బిజెపి మండిపడింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్రరావు అసెంబ్లీ ముట్టడికి ఇచ్చిన పిలుపుమేరకు కృష్ణ మండల బిజెపి ముఖ్య నాయకులను సోమవారం ఎస్సై నవీద్ ఆధ్వర్యంలో ముందస్తు అరెస్టులు చేశారు. అసెంబ్లీ ముట్టడి ఆందోళనలను ఆపడానికి ముందస్తు అరెస్టులతో ఆపడాన్ని వారు ఖండించారు. అరెస్టయిన వారిలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు అమర్దీక్షిత్, మాజీ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు సోంశేఖర్ గౌడ్, మండల అధ్యక్షులు నల్లె నర్సప్ప, మజ్జిగ సురేష్, మాజీ మండల అధ్యక్షులు జి శ్రీనివాస్ లు, జెగ్గిలి హుసేనప్ప, మాజీ ఎంపీటీసీ కొంకల్ వెంకటేష్, మండల ఉపాధ్యక్షులు డికె కిష్టప్ప వంటి ముఖ్య నాయకుల అర్ధరాత్రి నుంచి అరెస్టులు పర్వం కొనసాగింది. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కులను ప్రభుత్వం అణచివేస్తుందని, అరెస్టులతో తమను భయభ్రాంతులకు గురి చేయలేరని, హామీలు అమలు చేసేంతవరకు బిజెపి ప్రజల పక్షాన పోరాడుతూ ఉద్యమాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.మోసపూరిత హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టిన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా.. హామీలను అమలు చేయమంటే అర్ధరాత్రి దొంగల్లా పోలీసులతో అరెస్టులు చేయిస్తారా..? ఖబర్దార్.. రేవంత్ రెడ్డి అక్రమ అరెస్టులతో బీజేపీ ఉద్యమాన్ని ఆపలేరు అని బీజేపీ మాజీ ఎంపీటీసీ కొంకల్ వెంకటేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## తెలుగు యుగాది

## కాలెండర్ ఆవిష్కరించిన ఎంపిడిఓ

**కెటిదొడ్డి మార్చి 23, ప్రభాతవార్త:** మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం లో త్రిమత ఏకైక గురువు , ఆధ్యాత్మిక సామ్రాజ్య చక్రవర్తి, శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్ల దివ్య ఆశీసులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కే టీ దొడ్డి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో...త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్ (త్రైతశకం48) శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో ఎం పి డి ఓ రమణారావు ఆవిష్కరించారు .అనంతరం త్రైతశకం తెలుగు క్యాలెండర్ లను సిబ్బందికి, పలువురికి అందజేయడం జరిగింది. కమిటీ సభ్యులు మాట్లాడుతూ... శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన జ్ఞాన తెలుగు కాలసూచిక లో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికి సరళమైన భాషలో అర్థం అయ్యే విధానంరూపొందించడం జరిగిందని అన్నారు.. కాలసూచికలో చాలా విశేషాల్లో భాగంగా దేవాలయం సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండుగల విశిష్టత, తెలుగు నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకముల సారముతో పాటు ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉన్న భగవద్గీత యొక్క సారాంశం ఇందులో పొందుపరిచి స్వామి రచించడం జరిగిందని అన్నారు. తెలుగు నెలలు అనుసరించుటకు వీలుగా తెలుగు తిథుల తో ఆంగ్ల తేదీల ను పొందుపరచి తయారు చేసిన ఇటువంటి గొప్ప కాలసూచిక ను అందించడం ప్రజలందరూ హర్షించదగ్గ విశేషం అన్నారు.కార్యక్రమంలో త్రైతసిద్ధాంతంప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కే టి దొడ్డి కమిటీ అధ్యక్షుడు, రేణప్ప, ప్రసాద్, వీరేశ్, , నర్సమ్మ, అంజినేయ్య తదితరులు పాల్గొన్నారు..

## రైతు వ్యతిరేక విధానాలు

## అమలు చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

**తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ ఆగ్రహం**

**దామరగిద్ద, మార్చి 23 ప్రభాతవార్త :** తెలంగాణ రైతాంగాన్ని పూర్తిగా దెబ్బతీసే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలంగాణ జాగృతి నారాయణపేట్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో వరి వేస్తే ఉరే" అన్న విధానాన్ని మించిపోయేలా, ప్రస్తుత ప్రభుత్వం వరి సాగును పూర్తిగా తగ్గించే కుట్ర చేస్తున్నదని ఆయన ఆరోపించారు. విద్యుత్ కోతలు, యూరియా కొరత పేరుతో రైతులను భయపెట్టి పంట మార్పిడి వైపు నెట్టడం ప్రభుత్వ దురుద్దేశాన్ని సూచిస్తోందన్నారు. ఇప్పటికే రాష్ట్రం 71 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినప్పటికీ, కేంద్రం కొనుగోలు చేయదని చెప్పి రైతుల్లో భయం సృష్టించడం పూర్తిగా రైతు వ్యతిరేక చర్య అని విమర్శించారు. యూరియా అందించలేమని బహిరంగంగా ప్రకటించడం సీఎం వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తి అయ్యే యూరియాను రాష్ట్రానికి పూర్తిగా కేటాయించేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందని, కానీ ఆ ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. రాష్ట్రంలో కనీసం 10 లక్షల టన్నుల యూరియా నిల్వ ఉండేలా చర్యలు తీసుకోకపోవడం రైతులపై తీవ్రమైన నిర్లక్ష్యంగా అభివర్ణించారు. అవసరమైతే ఢిల్లీకి మంత్రుల బృందాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పప్పులు, చిరుధాన్యాలు పండించమని సూచిస్తున్న ప్రభుత్వం, వేల కోట్లతో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ప్రయోజనం ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టులు రైతుల కోసమా? లేక కమిషన్ల కోసమా అని నిలదీశారు.తెలంగాణ రైతాంగానికి జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ హెచ్చరించారు.

# భగత్‌సింగ్ త్యాగం భావి పోరాటాలకు స్ఫూర్తి

**వనపర్తి,మార్చి 23 ప్రభాతవార్త :** దేశ స్వాతంత్రం కోసం ఉరికొయ్యని ముద్దాడిన భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవుల త్యాగం భావి పోరాటాలకు స్ఫూర్తిగా తీసుకోవాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గకార్యదర్శి రమేష్ అన్నారు. సోమవారం సాయంత్రం సిపిఐ ఆఫీసులో అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్లమెంటులో పొగ బాంబులు విసిరి భారతీయుల స్వాతంత్ర ఆకాంక్షను భగత్ సింగ్ ఎలుగెత్తి చాటారన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినదించి తెల్లవారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించారన్నారు. ఆయన మరణం స్వాతంత్ర ఆకాంక్షను దేశం నలువైపులా పాకిందన్నారు. దేశం కోసం ప్రాణాలను లెక్క చేయని ఆయన దేశభక్తి త్యాగం నేటి యువతరానికి ఆదర్శం కావాలన్నారు. స్వాతంత్రం అంటే అధికార మార్పిడి కాదని అందరికీ విద్యా, వైద్యం ఉద్యోగము స్వేచ్ఛ సమ సమాజం అని నినదించారని పాలకుల వైఫల్యం వల్ల అవి నేటికి నెరవేరలేదన్నారు. పాలకులు దేశ సంపదను పేదల కష్టాన్ని సంపన్నులకు దోచిపెడుతున్నారని అవినీతి అక్రమాలు పిచ్చ పెరిగాయని ఫలితంగా యువత నిరాశతో పెడదారి పడుతున్నారన్నారు. యువశక్తిని ఉపయోగించుకునేందుకు అవినీతి అవిద్యకు వ్యతిరేకంగా యువత పోరాడాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశీ, భువన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమన్న, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కో కన్వీనర్, డిహెచ్‌పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, శిరీష, జ్యోతి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.



భగత్ సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

**భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్ వర్ధంతి**

**ఆశయాలను కొనసాగించాలని పిలుపు**

**ధన్వాడ, మార్చి 23 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని పాతపల్లి గ్రామంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ సంఘాల ఆధ్వర్యంలో శహీద్ భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్ 95వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు బాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మహేష్, పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ, శహీద్ భగత్ సింగ్ తక్కువ వయస్సులోనే భారత స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించి యువతకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు పేద, బడుగు, బలహీన వర్గాల మేలుకోసం ఉండి, సమానత్వ సమాజ నిర్మాణానికి దారి చూపాయని తెలిపారు. యువత, విద్యార్థులు ఐక్యతతో ముందుకు సాగితేనే దేశ అభివృద్ధి సాధ్యమని భగత్ సింగ్ చూపిన మార్గాన్ని అనుసరించాలని వారు పిలుపునిచ్చారు. స్వాతంత్రం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉరికంబాన్ని ముద్దాడిన మహానుభావుడిగా ఆయనను కొనియాడారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న పాలన, అంతర్జాతీయ పరిస్థితులపై కూడా వారు విమర్శలు వ్యక్తం చేశారు. దేశం స్వయం ఆధారంగా ఎదగాల్సిన అవసరం ఉందని, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను కొనసాగించడం ద్వారా నిజమైన స్వేచ్ఛ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు పరశురాం, అభి, పీవైఎల్ జిల్లా నాయకుడు గణేష్, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు జి. కృష్ణయ్య, వై.రాజు, గ్రామ సర్పంచ్ కే. టేరప్పతో పాటు గ్రామ యువకులు, పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

**భగత్ సింగ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలి**

**వీపనగండ్ల మార్చి 23, ప్రభాత వార్త:** దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ తెల్ల తలను ఎదిరించి సంపూర్ణ స్వాతంత్రం రావాలని భగత్ సింగ్ తన ప్రాణాన్ని ప్రాణంగా పెట్టి ప్రాణాలు వదిలినటువంటి భగత్ సింగ్ యువత కృషి చేయాలని వీపనగండ్ల సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దొడ్ల బాల్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నాడు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా వీపనగండ్ల గోపాల్దిన్నె గోవర్ధనగిరి బొల్లారం గ్రామాలలో భగత్ సింగ్ వర్ధంతి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వర్ధంతిలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దొడ్ల బాలిరెడ్డి మాట్లాడుతూ భగత్ సింగ్ రాజగురు సుఖదేవ్ వారి ఆశయ సాధన కోసం ఉద్యమించాలని అదేవిధంగా ఏదైతే స్వాతంత్ర ఉద్యమాలలో పాల్గొని మత ఉన్మాదులకు వ్యతిరేకంగా మనోధర్మశాస్త్రానికి వ్యతిరేకంగా బ్రిటిష్ వాళ్లకు వ్యతిరేకంగా పోరాడినటువంటి వ్యక్తి అని దేశంలో పేద ప్రజలు బలహీన వర్గాల వాళ్ళు స్వేచ్ఛ వాయువులు పీల్చుకునే విధంగా ఉండాలని అందుకోసం సంపూర్ణ స్వాతంత్రం కావాలని పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడినటువంటి వ్యక్తి అని ఆయన ఈసందర్భంగా స్మరించుకున్నారు.ఈరకంగా పోరాడినటువంటి భగత్ సింగ్ యొక్క జ్ఞాపకాలను యువత స్మరించుకొని ఆ యొక్క మహనీయుని ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండ్ల కృష్ణయ్య బాల గౌడు ఖాజా హుస్సేన్ రవి గోపాల్దిన్నె ఉపసర్పంచ్ వెంకటయ్య భాస్కర్ ఈశ్వర్ రామకృష్ణ నవీన్ రాముడు శివ తదితరులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

# మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందడం లేదు

**ఉప్పునుంతల సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు**

**ఉప్పునుంతల, మార్చి 23 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమికోన్నత బాలికల పాఠశాల లో మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదని ఉప్పునుంతల గ్రామ సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం అందించవలసిన గుడ్లు అందడం లేదని, లెక్క ప్రకారం విద్యార్థులకు 100 గ్రాముల భోజనం అందించాల్సి ఉండగా 50 గ్రాములు అందడం లేదని స్వయానా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల వద్ద ఉండి పరిశీలించారు. నీళ్ల పప్పు, నీళ్ళ చారును సర్పంచు ఇంఛార్జి హెచ్‌ఎం రాంచంద్రారెడ్డి ని ప్రశ్నించారు. నిత్యం ఇదేవిధంగా విద్యార్థులకు అందిస్తూ రా అని అడిగి తెలుసుకున్నారు. వంట ఏజెన్సీ వారు సక్రమంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం లేదని దీనిపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్తానని సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఇలాంటి దుస్థితి నెలకొంది అంటే మారుమూల గ్రామాల్లో ఏ విధంగా ఉందో అర్థమవుతుంది అన్నారు. ప్రాథమికోన్నత బాలికల పాఠశాల లో సోమవారం 42 మంది విద్యార్థులు హాజరైనట్లు రికార్డులో ఉండగా, క్షేత్రస్థాయిలో పరిశీలించగా 36 మంది విద్యార్థులు ఉన్నారు. ఉన్న 36 మంది విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి 100 గ్రాముల చొప్పున మధ్యాహ్నం భోజనం అందించాల్సి ఉండగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని సర్పంచి క్షేత్రస్థాయిలో స్వయానా పరిశీలించారు. 36 మంది విద్యార్థులకు సరిపడు అన్నం, పప్పు, నీళ్ళ చారు లేకపోవడంతో వారి పరిస్థితి ఏంటని ఇంఛార్జి హెచ్‌ఎం రాంచంద్రారెడ్డిని ప్రశ్నించారు. ఇంఛార్జి హెచ్‌ఎం రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ నేను 36 మంది విద్యార్థులు హాజరైనట్లు వంట ఏజెన్సీ వారికి తెలియజేయడం జరిగిందని వారి తప్పిదం వల్లే ఇలా జరిగిందని ఆయన వివరించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రికార్డును పరిశీలించగా 42 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని రికార్డులు నమోదు చేశారు. రికార్డును పరిశీలించిన సర్పంచు అవాక్కయ్యారు. రికార్డులో 42 మంది మధ్యాహ్న భోజనం అందుకున్న విద్యార్థులు 36 మంది, అయినప్పటికీ పూర్తిస్థాయిలో వారికి మధ్యాహ్న భోజనం అందించ లేదని సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌తో పాటు శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ బొల్లె లక్ష్మయ్య ఉన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం: డీఈఓ

**నారాయణపేట, మార్చి 23 ప్రభాతవార్త :** తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం రూపొందించిన డైరీని నారాయణపేట జిల్లా విద్యాశాఖ అధికారి డా.గోవిందరాజులు ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్జెక్టు ఫోరం డైరీ తయారీ ఒక వినూత్న ప్రక్రియ అని పేర్కొన్నారు ఈ డైరీలో అకాడమిక్ అంశాలను చేర్చి ఉపాధ్యాయుల రోజువారీ బోధనలో ఉపయోగపడేలా రూపొందించడం అభినందనీయమన్నారు. అకాడమిక్ స్టాండర్డ్స్, సాంఘిక శాస్త్రానికి సంబంధించిన ముఖ్య దినోత్సవాలు, టీచింగ్ డైరీ వంటి అంశాలతో సమగ్రంగా రూపొందించారని తెలిపారు. ఉత్తమ సమాజ నిర్మాణంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థుల్లో సామాజిక అవగాహన పెంపొందించడంలో ఈ సబ్జెక్టు ప్రధాన పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. జిల్లా అధ్యక్షుడు సాక రవి కుమార్ మాట్లాడుతూ ఈ డైరీలను జిల్లా వ్యాప్తంగా సుమారు 100 మంది ఉపాధ్యాయులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4,000 మంది ఉపాధ్యాయులకు ఈ ఫోరం డైరీలను అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు రాజేంద్ర కుమార్, నాగార్జున రెడ్డి, మండల ఎంఈఓ బాలాజీ, ప్రధాన కార్యదర్శి కనకప్ప, బాలరాజు ఆర్య, నరసింహ, రెడ్యప్ప, లక్ష్మణ్, నర్సిములు, నర్సింహచారి, రాములు, అంజయ్య, మాణిక్ ప్రభు, రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యా విధానాల్లో మార్పులు అవసరం

**పాలమూరు విశ్వవిద్యాలయంలో 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమాలపై విస్తృత సమీక్ష సమావేశం**

**మహబూబ్‌నగర్, మార్చి 23 ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా సోమవారం విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో వివిధ విభాగాల్లో అమలవుతున్న కార్యక్రమాలపై విస్తృత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ॥ పి. రమేష్ బాబు హాజరై, విభాగాల వారీగా జరుగుతున్న కార్యక్రమాలను సమీక్షించారు. కార్యక్రమాల అమలు స్థితి, విద్యార్థుల అభివృద్ధి, నైపుణ్య పెంపుదల చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అభివృద్ధికి అనుగుణంగా విద్యా విధానాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే, విభాగాల మధ్య సమన్వయం పెంపొందించేందుకు విద్యార్థులతో క్రీడా పోటీలు నిర్వహిం చాలని, దీనివల్ల విద్యార్థులలో జట్టు భావన, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని తెలిపారు.విద్యార్థుల ప్రాయోగిక జ్ఞానం పెంపొం దించేందుకు మూడవ మరియు నాల్గవ సెమిస్టర్ విద్యార్థులకు 30 రోజుల ఇండస్ట్రియల్ ఇంటర్న్‌షిప్పు సిలబస్‌లో భాగంగా చేర్చాలని సూచించారు. పరిశ్రమలతో అనుసంధానం ద్వారా విద్యార్థులు ఉద్యోగ అవకాశాలకు సిద్ధం అవుతారని పేర్కొన్నారు. ప్రతి విభాగం తమ అకాడమిక్, అడ్మినిస్ట్రేటివ్ కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల రూపంలో సమగ్రంగా ప్రదర్శించాలని సూచించారు. ఈ సమావేశంలో అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్ డా.ఎన్. చంద్ర కిరణ్, యూనివర్సిటీ పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్, ఐ క్యు ఏసి డైరెక్టర్ డా. డి. మధుసూదన్ రెడ్డి, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్ డా.సిహెచ్. రవికాంత్, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డా.ఏ.కరుణాకర్ రెడ్డి, చీఫ్ వార్డెన్ వైస్ ప్రిన్సిపల్ డా. మన్నెమోని కృష్ణయ్య, గద్వాల పీజీ సెంటర్ ప్రిన్సిపల్ డా.కె. వెంకటరెడ్డి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డా. కె. రాజ్‌కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ డా. ఎస్. రవికుమార్, ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. ఎస్.ఎన్. అర్జున్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పియూ రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు

# బడ్జెట్‌లో గ్రాడ్యుయేట్‌లకు తీవ్ర అన్యాయం

**ప్రజా సమస్యలను విస్మరిస్తే ఉద్యమిస్తాం.. తెలంగాణ గ్రాడ్యుయేట్ రాష్ట్ర అధ్యక్షులు నరేందర్ గౌడ్**

**మహబూబూబ్‌నగర్, మార్చి 23 ప్రభాతవార్త :** తెలంగాణ బడ్జెట్ శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్‌లకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేశారని తెలంగాణ గ్రాడ్యుయేట్ రాష్ట్ర అధ్యక్షులు నరేందర్ గౌడ్ మండిపడ్డారు. మహబూబ్‌నగర్ సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి నిరుద్యోగులను పట్టభద్రులను మోసం చేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచిన రాష్ట్ర బడ్జెట్ అన్నారు. బీసీ సబ్ ప్లాన్, కళాశాలలో మౌలిక వసతులు కరువు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా కమిషన్ సిఫార్సు మేరకు తెలంగాణ రాష్ట్రంలోని సొంత భవనాలు, డీఎస్సీ, అధ్యాపకుల నియామక ప్రక్రియ ఏర్పాటు, ప్రభుత్వ హాస్టల్లో విద్యార్థులకు కనీస సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యా వ్యవస్థకు నూతన బడ్జెట్ కేటాయించి వారి సంక్షేమానికి కృషి చేయాలని వారు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే విద్యారంగానికి మొండి చేయి చూపించకుండా ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయండి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గ్రాడ్యుయేట్‌ల కమిటీలు వేసి సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే తెలంగాణ రాష్ట్ర మంతట గ్రాడ్యుయేట్లు, విద్యావంతులు, విద్యార్థి సంఘాలు, నిరుద్యోగులు అందరు కలిసి ఉద్యమిస్తామన్నారు. అనంతరం గ్రంథాలయంలోని నిరుద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రాడ్యుయేట్ జిల్లా అధ్యక్షురాలు శ్రీవల్లి, ఉపాధ్యక్షులు అక్షయ్ కుమార్, వెంకటేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి రవీందర్, వికారాబాద్ ప్రెసిడెంట్ రాఘవేందర్ రెడ్డి, నాయకులు ఆదిత్య జ్యోతి తదితర నాయకులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న తెలంగాణ గ్రాడ్యుయేట్ రాష్ట్ర అధ్యక్షులు నరేందర్ గౌడ్

## భూత్పూర్ తొమ్మిదో వార్డులో డ్రైనేజీ

## పనుల్ని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్

**భూత్పూర్,మార్చి 23,ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) మధుసూధన్‌నాయక్ సోమవారం భూత్పూర్ పట్టణ కేంద్రాన్ని సందర్శించి పట్టణ మున్సిపాలిటీలోని తొమ్మిదో వార్డు బీసీ కాలనీలో పట్టణ మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బంధి చేపడుతున్న డ్రైనేజీ పనులు,పారిశుధ్య చర్యల్ని పరిశీలించారు.మురుగు కాల్వలు,రోడ్లపై చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్ మున్సిపాలిటీ సిబ్బంధిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సూపరిన్‌టెండెంట్ నర్సింహులు ఇతర సిబ్బంధి పాల్గొన్నారు.

## హుండీ దొంగతనానికి

## యత్నించిన వ్యక్తి అరెస్ట్

**రాత్రి పెట్రోలింగ్‌లో పట్టుకున్న పోలీసులు**

**మద్దూర్, మార్చి 23 ప్రభాతవార్త :** మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హుండీ దొంగతనానికి యత్నించిన ఓ వ్యక్తిని పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి అరెస్ట్ చేసినట్లు మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. దామరగిద్ద మండలం మొగల్ మడక గ్రామానికి చెందిన ఆవుసుల రమేష్ అర్ధరాత్రి సుమారు 12:30 గంటల సమయంలో మద్దూర్ టౌన్‌లోని హనుమాన్ దేవాలయంలో హుండీని పగలగొట్టి దొంగతనం చేయడానికి ప్రయత్నించాడు.ఈ సమయంలో రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అతని అనుమానాస్పద కదలికలను గమనించి వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేయగా, నిందితుడు నేరాన్ని ఒప్పుకున్నాడు.ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

## డంపింగ్ యార్డును సందర్శించిన

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్



డంపింగ్ యార్డును సందర్శిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

**మహబూబ్‌నగర్, మార్చి 23 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ వీరన్నపేట నందు గల చెత్త సేకరణ కేంద్రాన్ని సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరిశీలించారు. చెత్త సేకరణ కేంద్రం(డంపింగ్ యార్డ్)లో తీసుకోవలసిన చర్యలను, అగ్ని ప్రమాదాలను రాకుండా ప్రతి రెండు రోజులకు ఒకసారి నీటిని పొడి చెత్త పై వేసి మంటలు కాకుండా అదుపు చేసేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్మి కంపోస్టులను పరిశీలించారు. డంపింగ్ యార్డు లో పని చేస్తున్న సిబ్బందికి తగు జాగ్రత్తలు తీసుకోగలరని అదనపు కలెక్టర్ సూచించారు.

## కిష్టాపూర్‌లో సీసీ రోడ్డు,

## డ్రైనేజీ పనులకు శ్రీకారం

**ధన్వాడ,మార్చి23 ప్రభాతవార్త:** ధన్వాడ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు,డ్రైనేజీ నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా రూ.7 లక్షల వ్యయంతో ఈ పనులను చేపట్టారు.గ్రామ సర్పంచ్ కొండయ్య ఈ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఇలాంటి పనులు నిరంతరం కొనసాగుతాయని, ప్రజల సహకారంతో కిష్టాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**నర్వ,మార్చి 23 ప్రభాతవార్త :** నర్వ మండలంలోని నాగిరెడ్డి పల్లి గ్రామం లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నర్వ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లు పాల్గొని గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు,ఎంపీఓ రాఘవేందర్, పంచాయతి రాజ్ ఏఈ,పంచాయతి సెక్రెటరీ,వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

